
# కాకతాళీయం

**వై.సి.పి. వెంకటరెడ్డి**




చదివిన ఉత్తరాన్నే చదువుతున్నాడు రంజన్. ఎన్నోసార్లు చదివాడు. మళ్లీ అదే ఉత్తరాన్ని చదువుతున్నాడు.

రంజన్ కాలేజీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అయితే అందరిలా అల్లరి చిల్లరగా తిరగడు. అమ్మాయిల్ని చూసి వ ళ్లికిలించడు. అసలు అమ్మాయిల వేపు చూడనే చూడడు. ఏ హీరో అభిమాన సంఘంలోనూ సభ్యుడు కాదు.

అమ్మాయిల పట్ల అతడి ప్రవర్తన చూసిన ఆకతాయి కుర్రాళ్లు అతణ్ణి 'అభినవ ప్రవరుడు' అనే బిరుదుతో సత్కరించారు.

"ప్రవరుడు కాదు, గ్రివరుడు కాదు కొజ్జా వెధవ!" అన్నారు నోటి దురుసు విద్యార్థులు.

అలాంటి మెతక వాడిని కాలేజీ సుందరి ప్రేమించిందంటే ఎంతోమంది ముక్కు మీద వేలేసుకున్నారు.

"ప్రేమా గాదు, దోమా గాదు - ఏదో మస్కా కొట్టడానికి ప్లాన్ వేసింది" అన్నారు అన్నింటినీ అనుమానించే వాళ్లు.

కాలేజీ సుందరి అసలు పేరు లత. అయితే ఆమెను ఎవరూ ఆ పేరుతో పిలువరు.

విలక్షణమైన కట్టూ - బొట్టూ, హావభావాలు, అందచందాలు చూసి ఎవరు ఏ శుభముహూర్తంలో ఆ అమ్మాయికి కాలేజీ సుందరి అని నామకరణం చేశారో గాని, అసలు పేరు అడుగంటిపోయి ఆ పేరే ప్రచారమైపోయింది.

రంజన్ చదువుతున్న కాలేజీలోనే లత కూడా డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోంది.

వర్షపు చినుకుల కోసం నిరీక్షించే చాతక పక్షుల్లా లత కటాక్ష వీక్షణాల కోసం ఎంతోమంది విద్యార్థులు తహతహ లాడుతోంటే అందరినీ కాదని అనామకుడిలా ఉండే రంజన్‌ను ఆమె ప్రేమించడం నమ్మలేని వింత విషయం అయింది. రంజన్ కూడా ఆనందాశ్చర్యాలతో ఉక్కిరి బిక్కి రయ్యాడు.

ప్రేమ వ్యవహారాల్లో పురుషులు చొరవ తీసుకోవడం సహజం. అలాగని రంజన్ చొరవ తీసుకోలేదు. అతడు చొరవ తీసుకొని ఉంటే ఇది చర్చనీయాంశం అయ్యేది కాదు.

ప్రేమ లేఖతో ప్రారంభించిన లత పరిచయం పెంచుకొని పరిణయం చేసుకోమని పట్టుబట్టింది.

ఉబుసుపోకకు ప్రారంభమయిన ఉత్తరాయణం ప్రేమాయణంగా పరిణతి చెందుతుందని, క్రమేపీ అది పెళ్లికి దారి తీస్తుందని ఊహించని రంజన్ తికమకపడసాగాడు.

'చేసుకుంటానంటే తల్లిదండ్రులు ఏమంటారో? చేసుకోను అంటే లత ఏం అల్లరి చేస్తుందో?' అని బుర్ర బద్దలు కొట్టుకుంటున్న సమయంలో వచ్చిన తండ్రిగారి ఉత్తరం ఉపశమనం కలిగించింది రంజన్‌కు.

అందుకే ఆ ఉత్తరాన్ని పదే పదే చదవడం

"హల్లో రంజన్!" అంటూ అమ్మాయి గదిలో [illegible] పెట్టడమూ, "హల్లో లతా!" అంటూ రంజన్ [illegible]వుతున్న ఉత్తరాన్ని టేబుల్ మీద పెట్టడమూ [illegible]గి జరిగాయి.

"ఏదో శ్రద్ధగా చ[illegible]వుతున్నారే?" అంది లత.

"చెబుతా, కూచోండి" అంటూ కుర్చీవేపు చూపించాడు.

కూచుంది లత.

'నాన్నగారు రాసిన ఉత్తరం [illegible] చూపించాలా, వద్దా?' అని తటపటాయిస్తూ ఉండగా - "మీ నాన్నగారికి ఉత్తరం రాశారా?" అంది లత.

"నేను రాయాలని అనుకుంటూ ఉండగానే మా నాన్నగారు రాశారు" అన్నాడు రంజన్.

"ఏవో క్షేమ సమాచారాలు, ఇంటి విషయాలు రాసి ఉంటారు" అంది లత.

"కాదు, మన విషయాలే రాశారు."

"ఏం రాశారు?"

"చూడండి!" అంటూ ఉత్తరం లత చేతికి ఇవ్వబోయాడు.

"చదవండి" అంది లత.

ఉత్తరం చదవసాగాడు రంజన్.

"చిరంజీవి రంజన్,

"కథలు రాసే విషయంలో నాకు సలహా లిస్తున్న నీకు ఇలాంటి ఉత్తరం రాయవలసి వస్తుందని కలలో గూడా అనుకోలేదు. గత్యంతరం రాయవలసి వచ్చినందుకు చింతిస్తున్నాను."

"మీ నాన్నగారు కథలు రాస్తారా?" ప్రశ్నించింది లత కుతూహలంగా.

"అవును, రాస్తారు" అన్నాడు ముక్తసరిగా.

"సరే చదవండి."

చదవసాగాడు.


"ప్రమాదం ఎప్పుడు ఏ రూపంలో ఎలా వస్తుందో ఎవరికీ తెలీదన్న నగ్నసత్యాన్ని అంగీకరించక తప్పదు. తన కేం లోటు లేదని, భవిష్యత్తులో కలగదని ధీమాగా త లెత్తుకొని తిరిగే మానవుడికి అనుకోని రీతిలో ఆకస్మికంగా ఏదో ప్రమాదం ముంచుకొచ్చి ఎత్తిన తల సిగ్గుతో వంచుకొనేలా చేస్తుంది. అందుకే మానవాతీతమయిన మహత్తర శక్తి ఏదో మనల్ని నడిపిస్తోందన్న రహస్యం విడివడని చిక్కు ముడిలా ఉండిపోయింది."

"ఇదీ కథలా ఉందే?" అంది లత కొత్త విషయం కనుగొన్నదానిలా.

"రచయిత లంటే ఏమనుకున్నారు?" అన్నాడు గర్వంగా.

"సరే చదవండి" అంది.

"కుమారులు భవిష్యత్తులో తమ కేదో ఒరగబెడతా రన్న ఆశ లేకపోయినా పిల్లల్ని పెంచి, పెద్ద చేసి, విద్యాబుద్ధులు చెప్పించి, తీర్చిదిద్ది ప్రయోజకుల్ని చేయడం తమ విధ్యుక్త ధర్మంగా భావించి, తమ పిల్లల్ని అభ్యుదయ




మార్గంలో నడిపించడానికి తల్లిదండ్రులు శాయశక్తులా కృషి చేస్తారు.

"వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు సేవ చేయడం పిల్లల బాధ్యత. సేవ చేయకపోయినా కృతజ్ఞత కలిగి ఉండడం కనీస ధర్మం. కృతఘ్నులై తల్లిదండ్రుల మనసు నొప్పించడం మానవులు చేసే పని కాదు. నీవు అలాంటి నీతిమాలిన పని చేసి మా మనసు నొప్పించావు. నిన్ను ప్రయోజకుణ్ణి చేయటానికి మేము ఎంత కష్టపడ్డామో నీకు తెలీదు. తెలియజేయడానికే ఈ ఉత్తరం రాస్తున్నాను."

"నీతిమాలిన పని చేశారా?" అడిగింది లత ఆశ్చర్యంగా.

"తినబోతూ రుచి అడుగుతా రేం?" అన్నాడు రంజన్.

"అయితే చదవండి."

"ప్రతి పరీక్షలోనూ నేను ఊహించిన మార్కుల కంటే ఎక్కువ మార్కులు సంపాదించి 'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అనే సామెత సత్యమని నిరూపించావు. అద్వితీయమైన తెలివితేటలు కలవాడివని, మంచి ఉద్యోగివై భవిష్యత్తులో మాకు సహాకరిస్తావని, నాతోబాటు అన్నగారు కూడా డబ్బు పంపించి అన్ని సదుపాయాలూ సమకూర్చారు.

"నేను ధనికుణ్ణి కాదన్న వాస్తవం మాత్రమే నీకు తెలుసు. ఒకే ఒక్క పట్టు, ఒకే ఒక్క ధోవతితో ఒక సంవత్సరం గడిపానంటే ఒకనాటి నా ఆర్థిక దుస్థితిని సులభంగా అంచనా వేయవచ్చు. 'సన్నన్నం సున్న సుమీ పన్నుగ పల్నాటి సీమ ప్రజ లందరికిన్' అన్నాడు శ్రీనాథుడు. పల్నాటి ప్రాంతం ప్రజల్లాగా నేనూ ఒకప్పుడు వరి బియ్యం అన్నం కోసం తహతహలాడిన నగ్నసత్యం నీకు తెలీదు.

"ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా నీ అభిమతానికి వంతపాడి అప్పులు చేసి ఎంతో డబ్బు నీ చదువులకు తగలేశాం. నీవు ఏరు దాటాక తెప్ప తగలేసే వాడివని, పయోముఖ విషకుంభం అని, నివురుగప్పిన నిప్పువని, గోముఖ వ్యాఘ్రమని గుర్తించలేక పొరబడ్డాం. దేవుడిలా కనిపించే నీలో దానవుడు దాగి ఉన్నాడన్న సంగతి తెలుసుకోలేకపోయాం. అందుకే 'మనిషి మర్మం, నీళ్ల లోతు తెలుసుకోవడం కష్టం" అన్నారు పెద్దలు."

"చవటలా కనిపించే మీ గుణగణాల్ని వర్ణించడానికి ఇన్ని విశేషణాలు ఉపయోగించారే మీ నాన్నగారు" అంది లత వయ్యారంగా పైట సవరించుకుంటూ.

"చవటలా కనిపిస్తానా?" అన్నాడు రంజన్ ఆముదం తాగిన వాడిలా ముఖం పెట్టి.


"చదువులో కాదనుకోండి" అంది తాపీగా లత.

"మరి దేంట్లో?"

"చదవండి... కొండవీడు చేంతాడులా ఉందిగా ఉత్తరం" అంది మాట దాటవేస్తూ.

చదవసాగాడు రంజన్.

"కని, పెంచి, పెద్ద చేసి, దాదాపు ఇరవై ఏళ్లు




కలసి మెలసి ఉన్న మేమే నీ నిజస్వరూపాన్ని పసికట్టలేక పొరబడినప్పుడు, కొన్నాళ్ల క్రితం పరిచయమైన ఆ అమ్మాయి గుణగుణాల్ని గురించి నీకేం తెలుసు?

"అనుకున్న కార్యం అనుకూలమయ్యే వరకూ వినయం నటించవచ్చు. వినయ విధేయతలు, భక్తిప్రపత్తులు, ప్రేమానురాగాలు, సిగ్గూ శరము ఉన్న అమ్మాయి అయితే ముక్కూ మొహం తెలీని పరాయి యువకుడితో స్నేహం చేస్తుందా?"

"ఎవ రా అమ్మాయి?"

"అడ్డు ప్రశ్నలు వేసి విసిగించక విను."

"జవాబు చెబితే వింటా" అంది మొండిగా.

"లత... కాదు... కాదు... కాలేజీ సుందరి!" అన్నాడు.

"మన స్నేహం గురించి మీ నాన్నగారికి రాశారా?"

"లేదే!"

"మరి ఆయనకు ఎలా తెలిసింది?"

"చెప్పానుగా రచయిత అని. 'రవి కాంచనిచో కవి కాంచునే కదా" అన్నారు పెద్దలు."

"అబద్ధం. మీ నాన్నగారికి ఎవరో చెప్పారు."

"ఎవరయినా చెప్పారో, ఆయనే ఊహించారో తెలీదు. ఉత్తరం చదవమంటారా, వద్దా?"


"సారీ... చదవండీ, చదవండి...!"

"అమ్మా - నాన్నకు తెలియకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడితే వాళ్లు ఎంత బాధపడతారో నన్న జ్ఞానం కూడా నీకు లేకపోయిందా! అందుకే 'అడ్డాలనాడు బిడ్డలు గాని గడ్డాల నాడు బిడ్డలా' అన్నారు.

"చీడపురుగులా సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల వ్యవస్థను, మత మాఢ్యాన్ని సమూలంగా నిర్మూలించాలన్న సద్భావంతో సంఘ సంస్కర్తలు కులాంతర, మతాంతర వివాహాల్ని ప్రోత్సహిస్తున్నారు. ఆలోచన మంచిదే. కులాంతర వివాహమయినా, మతాంతర వివాహమయినా ఆదర్శ వివాహమైతే నాకు ఇష్టమే. ఆ విషయం నీకూ తెలుసు. తెలిసీ దొంగచాటుగా నిర్ణయించుకున్నావంటే ఏదో మోసం జరిగిందని అనుమానిస్తున్నాను.

"ఇరువక్షాల పెద్దలు, బంధువులు అంగీకరించి కలసి మెలసి చేస్తేనే కులాంతర వివాహమైనా, మతాంతర వివాహమైనా కొన్నాళ్లు మనగలుగుతుంది. లేకపోతే ఎంత త్వరగా కలుసుకుంటారో అంత త్వరగా విడిపోతారు. అలా విడిపోయిన దంపతులు ఎందరో నాకు తెలుసు.

"కుటిల రాజకీయ నాయకుల జిత్తులమారి ఎత్తుగడల ప్రభావంతో కులాలు, మతాలు వెర్రితలలు వేసి ఘర్షణలకు దిగి నెత్తుటి ఏరులు పారిస్తున్న ప్రస్తుత విషమ పరిస్థితుల్లో కులాంతర, మతాంతర వివాహాలు సమస్యకు పరిష్కారం కావచ్చు. అయితే అలాంటి పెళ్లిళ్లు పెద్దల అంగీకారంతో జరిగితేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అలా కాకుండా దొంగచాటుగా చేసుకుంటే సమస్య మరీ జటిలమయ్యే ప్రమాదం లేకపోలేదు.



తిరుపతి

"మీ అబ్బాయికి గుండెక్కడ చేయించారు? తిరుపతేనా?" అడిగాడు ఆనందం వస్తాద్ వీరయ్యను.

"అబ్బే? అదేంకాదు. మొన్న ఆయిల్ బాత్ చేయిస్తుంటే కొస్త గట్టిగా ప్రెస్ చేశానంతే?"

ఎస్.ప్రమీలా బాలరమేష్‌రెడ్డి [తిరుపతి]

"'పెళ్లి నూరేళ్ల పంట' అన్నారు అనుభవజ్ఞులు. కాబట్టి జీవిత భాగస్వామిని ఎంచుకొనే విషయంలో యవ్వనోద్వేగం కాని, కామోద్రేకం కాని పనికిరావు. చక్కగా ఆలోచించి, మంచి-చెడులు బేరీజు వేసుకొని జీవిత భాగస్వామిని ఎంచుకోవడం మంచిది. అందువల్ల ఆ బాధ్యత అనుభవజ్ఞులైన పెద్దలకే అప్పగించడం శ్రేయస్కరం. అలా కాకుండా తల్లిదండ్రులను, అన్నదమ్ములను, బంధు-మిత్రులను ధిక్కరించి చేసుకున్న ప్రేమ పెళ్లిళ్లు మూడునాళ్ల ముచ్చటగా ముగిసిపోతున్నాయి. పిల్లలు కలిగి, కోరికలు తగ్గి మోజు మోకాళ్లకు దిగిననాడు అలనాటి ప్రేమ ద్వేషంగా మారి, అడుగడుగునా పరస్పరం దోషారోపణలు చేసుకొని, గత్యంతరం లేక విడాకులు తీసుకున్న ప్రేమ జంటలు ఎన్నో ఉన్నాయి.

"అటు అత్తవా రింటికి వెళ్లకూడదని, ఇటు మన ఇంటికి రాకూడదని నిర్ణయించుకోవడం నీ పిరికితనానికి తార్కాణం. లోకం ఏమంటుందో నన్న భయం.

"చేసే పని మంచిదని మన మనసుకు తోచినప్పుడు లోకుల విమర్శల్ని ఖాతరు చేయవలసిన అవసరం లేదని నీ మిత్రులతో వాదిస్తూ ఉండగా విన్నాను. 'లోకులు కాకులు' అనే సామెతను దృష్టిలో పెట్టుకొని అలా వాదించావని నా అభిప్రాయం. నాన శ్రేయోభిలాషులు కూడా లోకులే కగా వాళ్లూ కాకులేనని కొట్టిపారేయడం సమంజసమా? అందరికీ అన్ని విషయాల్లో అనుభవం, చొరవ ఉండదు. అందువల్ల ఎంత తెలివయిన మనిషయినా తనకు అనుభవంలేని విషయంలో పొరపాటు పడిపోవడం సహజం. అలాంటి సమయాల్లో అనుభవజ్ఞుల సలహా తీసుకోవడం తప్పు కాదు.

"వృద్ధాప్యంలో తల్లిదండ్రుల్ని చూసుకోవలసి వస్తుందేమో నని, ఆ జంజాటం తప్పించుకోవాలనే ఉద్దేశంతో పలాయనం చిత్తగించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నావు. నీలాంటి పిరికిపందలు, పలాయనవాదులు కులాంతర వివాహం చేసుకున్నా మతాంతర వివాహం చేసుకున్నా సమాజానికి ఒరిగే దేమీలేదు. సంఘ సంస్కరణాభిలాష లేనప్పుడు అలాంటి వివాహం చేసుకోవలసిన అవసరం ఏముంది? ఎవరిని ఉద్ధరించడానికి ఆ ప్రయత్నం?

"వివాహ విషయంలో చాలా కాలం నుండి నాకు కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి, వాటిని ఇప్పుడు మార్చుకోను" అని అన్నావని తెలిసింది. కామోద్రేకంతో తప్పటడుగు వేసి, ఆ తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవటానికి డొంకతిరుగుడుగా వాదించి, ఆ వాదానికి ఆదర్శం అంటగట్టడానికి ప్రయత్నించడం 'దయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉంది.

"ఏనాడూ అమ్మాయిల వేపు కన్నెత్తి చూడని నీకు అయాచితంగా అంది వచ్చిన అమ్మాయి అప్సరసలా కనపడడంలో ఆశ్చర్యం లేదు. ఆమె

పలుకులు, చేష్టలు ఎంతో ఆకర్షణీయంగా తోచి, 'గుడ్డెద్దు చేలో పడ్డట్టు' అమ్మాయి మోజులో పడిపోయావు. 'ఆడుదాని చూడ అర్థంబు చూడ బ్రహ్మకైన పుట్టు రిమ్మతెగులు' అన్నాడు వేమన. సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడికే రిమ్మతెగులు పుట్టినప్పుడు ఏమాత్రం లోకజ్ఞానం లేని నీవు బోల్తా కొట్టడంలో వింత ఏముంది!

"ఆదర్శ వివాహానికి నేను విముఖుణ్ణి కాదు. అమ్మాయి తల్లిదండ్రులు అంగీకరిస్తే అందరమూ కలసి ఆనందంగా పెళ్ళి తంతు జరిపేస్తాం.

"మరో ముఖ్య విషయం: అక్కయ్యకు పెళ్ళి చేయకుండా నీకు పెళ్ళి చేయడం సమంజసం కాదు. ప్రస్తుతం అక్కయ్యకు పెళ్ళి చేయడానికి తగిన ఆర్థిక స్తోమత మనకు లేదు. అమ్మాయి తండ్రిగారి ఆర్థిక స్తోమతకు మించి కట్న కానుకలు కోరడం తప్పే, కాదనను. అయితే తండ్రి ఆస్తిలో అమ్మాయికి న్యాయంగా రావలసిన వాటా అడగడం అన్యాయం కాదు. ఈ సంగతి అమ్మాయికి తెలియజేయడం నీ బాధ్యత."

"ఇక చాలు, చాలించండి... మీకు ఏమాత్రం లోకజ్ఞానం లేదని మీ నాన్నగారు రాశారు. ఇంతకంటే ఎక్కువ లోకజ్ఞానం ఎవరికి ఉంటుంది...? ఏమీ తెలియని అమాయకుడిలా ప్రవర్తిస్తూ అన్ని విషయాలూ తండ్రిగారికి అందజేశారు... మళ్ళీ వస్తాను...!" అంటూ లేచి విసురుగా వెళ్ళిపోయింది లత, ఉరఫ్ కాలేజీ బ్యూటీ.

** ** **


"ఎక్కడో యర్రవంకపల్లెలో ఉన్న నాన్నగారికి నా ప్రేమ వ్యవహారం ఎలా తెలిసిందో అర్థం కావడం లేదు. తెలియజేయాలా, వద్దా అన్న సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతూ ఉండగా నాన్నగారికి తెలిసిపోయింది. తెలిస్తే ఏమంటారో అన్న భయంతో అల్లాడిపోతున్న సమయంలో సుముఖత తెలియజేస్తూ ఉత్తరం రాసి ఊరట కలిగించారు.

"ఈ పెద్దవాళ్ళందరికీ ఒకే జబ్బు. అందరూ తమ చెప్పు చేతల్లో ఉండాలన్న జబ్బు. తమ అధికారం చెల్లని రోజు నీళ్ళలోని చేప బయట పడినట్లు విలవిల్లాడిపోతారు.

"వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సేవ చేయకూడదని నేను అనుకున్నానా? ఎవరికీ తెలియజేయకుండా ప్రేమ వివాహం చేసుకొని స్వగ్రామానికి వెళ్ళడానికి ఇష్టం లేకపోతే అమ్మా - నాన్నను నా వద్దకే పిలిపించుకోవచ్చు.

కాలేజీ సుందరిగా పేరు పొందిన లత తనకు తానుగా నా స్నేహం కోరడం నా అదృష్టం. ఆమెతో మాట్లాడ్డానికి ఎంతోమంది తహతహ లాడుతూ ఉండగా వాళ్ళందరినీ తృణప్రాయంగా తృణీకరించి, నాతో స్నేహం చేయడమే గాక, నా జీవిత భాగస్వామిగా రావడానికి తహతహ లాడుతోంది. అందుకే కాబోలు 'మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అన్నారు పెద్దలు.

తనలో తాను ఆలోచిస్తున్న రంజన్ 'పోస్ట్ సార్!' అన్న పిలుపుతో ఈ లోకంలోకి వచ్చి, పోస్టుమాన్




ఇచ్చిన కవరు అందుకున్నాడు.

కవరు మీది దస్తూరీ చూసి లత రాసిందని గ్రహించి, ఆత్రంగా చించి ఉత్తరం తీసుకొని మనసులో చదవసాగాడు.

"నా బుజ్జి నిరంజన్!

"నేను నిజ్జంగా నిన్ను ప్రేమిస్తున్నాని అనుకున్నావు కదూ? పాపం! నిన్ను చూస్తే నాకు జాలి కలుగుతోంది.

"నీలో మగ లక్షణాలు మృగ్యమని, ఆడతనం ఉన్న మగవాడివని, అందుకే ఆడపిల్లల్ని చూస్తే సిగ్గుతో తల వంచుకుంటావని, ఆడపిల్లలతో మాట్లాడవని, మాట్లాడేలా మార్పగలిగితే అయిదు వందలు రూపాయలు ఇస్తామని నా క్లాస్‌మేట్స్ పందెం కాశారు. మా ఊహ వాస్తమని, నీతో స్నేహం చేసినా ప్రమాదం లేదని ధైర్యంగా పందెం కాశాను. మొదటి మెట్టుగా నీకు ప్రేమ లేఖలు రాయించాను. [పెళ్ళి కాని ఆడపిల్లలు మగపిల్లలకు ప్రేమ లేఖలు రాయడం ప్రమాదం కదా?]

"మా ఊహ నూటికి నూరు శాతం వాస్తవం కాదని, అంతో ఇంతో మగతనం ఉన్నవాడివని గ్రహించగలిగాను. ఎలాగయితేనేం పందెం గెలిచాను.

"చొరవ తీసుకోవడానికి భయపడ్డావు కాబట్టి ఎలాంటి ప్రమాదం లేకుండా కన్యగా బయట పడగలిగాను.

"పాపం, మీ నాన్నగారికి ఎంత ఆశ! మా ఆస్తిలో వాటా కావాలట! వాటా మాట అలా ఉంచి, మీరే కన్యాశుల్కం ఇచ్చి, కాళ్ళా వేళ్ళా పడి ప్రాధేయపడినా మా నాన్నగారు నన్ను నీకివ్వడానికి సుతరామూ అంగీకరించరు.

"దురుసుగా వ్యవహరించి నన్ను అల్లరిపాలు చేయకుండా పందెం గెలవడానికి సహకరించిన మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అన్యథా భావించవని ఆశిస్తూ-

"నీ శ్రేయోభిలాషి."

కళ్ళు తిరిగినట్లయితే వాలు కుర్చీలో చేరగిలపడ్డాడు.

నాన్నగారికి ప్రత్యుత్తరం ఏం రాయాలో పాలుపోక ఆలోచించసాగాడు.

రాత్రంతా కలలు... పలవరింతలు... కలత నిద్ర!

** ** **

తెల్లవారింది.

రాత్రంతా ఆలోచించిన రంజన్ ఆడపిల్లలతో స్నేహం చేయకూడదని నిర్ణయించుకున్నాడు. ఆ విషయం మరిచిపోవాలని ఎంత ప్రయత్నించినా ఆలోచనలు అతణ్ణి వదల్లేదు.


(తరువాయి 61 వ పేజీలో)

### తెలుసా?

ఒక మిలియన్ ఎంత అని అంటే మీరు టక్కున పది లక్షలు అని సమాధానం చెబుతారు. కానీ ఒక బిలియన్ అంటే ఎంతో చెప్పగలరా?..... మీ రొకవేళ మిలియన్ మిలియన్ అన్నారనుకోండి నేను వెయ్యి మిలియన్లు ఒక బిలియన్ అంటాను. ఈ రెండూ కరెక్టే మరి! ఒక బిలియన్ అంటే ఒకటి తర్వాత 9 సున్నాలు వేస్తారు. కానండోయ్, ఈ విషయంలో కూడా ప్రపంచదేశాల్లో భేదాభిప్రాయా లున్నాయి. కెనడా, ఫ్రాన్స్, యునైటెడ్ స్టేట్స్‌ల్లో బిలియన్ విలువ 1000,000,000గా వ్యవహరిస్తారు. కానీ మేం అలా ఒప్పుకోమంటూ యునైటెడ్ కింగ్‌డం, పశ్చిమ జర్మనీవాసులు దీని విలువ 1,000,000,000,000గా ఒప్పుకుంటారు. మరి ఎవరిది సరైన వాదమో ఎవరు తేల్చాలండీ?

1 లక్ష = 100 వేలు
10 లక్షలు = 1 మిలియను
1 కోటి = 10 మిలియన్లు
1 బిలియన్ = 1000 మిలియన్లు
100 మిలియన్లు = 10 కోట్లు
1 ట్రిలియన్ = 1000 బిలియన్లు

సేకరణ: భోశ్రీ [హైదరాబాద్]




( 'కాకతాళీయం' 39 పేజీ తరువాయి)

నాన్నగారు అవులిస్తే పేగులు లెక్కపెడతారని అనుకొనేవాడు తను. అవులించకపోయినా లెక్కపెడతాడని ఇప్పుడు తెలుసుకున్నాడు. లతకూ, తనకూ తప్ప అన్యులకు ఏమాత్రం తెలియని రహస్యం నాన్నగారు ఎలా పసిగట్టారో ఎంత తల బాదుకున్నా అతడికి అర్థం కాలేదు.

పసికట్టినవారు ఊరికే ఉండకుండా అమ్మాయి తండ్రిగారి ఆస్తిలో వాటా అడగమని ఎందుకు రాయాలి? రాశాడు పో, నేను మాత్రం ఆ ఉత్తరం లతకు ఎందుకు చూపించాలి? చూపిస్తే మాత్రం పందెం గెలవడం కోసం నాటక మాడానని లత ఉత్తరం వ్రాయడం సమంజసమా?

నేను బుద్ధిమంతుణ్ణి కాబట్టి అమ్మాయి నాటక మాడినా, నాట్యం చేసినా సరిపోయింది. నేను తొందరపడి అసభ్యంగా వ్యవహరించి నాటకం రక్తి కట్టేలా చేసి ఉంటే?

ప్రేమించానని, పెళ్లి చేసుకుందామని అనడం నాటకమా, లేక పందెం గెలవడానికి నాటక మాడానని అనడం నాటకమా? నాటక మేదో, వాస్తవ మేదో అంతా తికమకగా ఉంది. నన్ను తిప్పలు పెట్టాలని నాటక మంటోందా? నాన్నగారికి తెలియకపోతే నాటకమయినా, వాస్తవమయినా నష్టం లేదు.

ఆలోచనలలో మునిగి తేలుతూ వాచ్ చూసుకున్నాడు. కాలేజీకి వేళయింది. హడావుడిగా కార్యక్రమాలు ముగించుకొని తొందర తొందరగా బయలుదేరాడు.

అందరూ అతడి వేపు ఆసక్తిగా చూడసాగారు. తదేకంగా చూడసాగారు. వింతగా, విచిత్రంగా చూడసాగారు. చూసిన వాళ్లు చూపు మళ్లించుకోకుండా చూస్తున్నారు. ముసిముసిగా నవ్వుతున్నారు. భావగర్భితంగా నవ్వుతున్నారు.

వాళ్ల నవ్వులు చూసి రంజన్‌కు భీతి పుట్టింది.

"మా ప్రేమాయణం, లత నన్ను తిరస్కరించిన విషయమూ వీళ్లకు తెలిసిందా? ... ఎలా తెలుస్తుంది? నేను చెప్పాలి, లేదా లత చెప్పాలి. లత చెబుతుందా? ఏమని చెబుతుంది?

"మగపిల్లలు - అందులోను ఆకతాయిలయితే 'వాళ్లను ప్రేమించాను, వీళ్లను ప్రేమించాను' అంటూ గప్పాలు కొట్టుకోవటం సహజం. ఆడపిల్ల అలా చెప్పుకుంటుందా? ఒకవేళ చెప్పినా ఆడపిల్లలకు చెప్పచ్చు... ఆడపిల్లలకు చెబితే మగపిల్లలకు ఎలా తెలిసింది?" అనుకున్నాడు రంజన్ తనలో తాను.

కాలేజీ వరండాలో అతడి మిత్రుడు జయరాం కనిపించాడు. అతడూ అందరిలాగే నవ్వుతున్నాడు.

"అందరికీ ఒకే జబ్బు - నవ్వే జబ్బు. వీళ్లంతా 'లాఫింగ్ గాస్' పీల్చారా కొంపదీసి!" అనుకున్నాడు రంజన్.

"ఏరా, పిచ్చి పట్టిందా?" అన్నాడు జయరాం.

"నాకు కాదు పిచ్చి, మీకు!" అంటూ విరుచుకుపడ్డాడు రంజన్.

"మాకేం పిచ్చి?" అన్నాడు జయరాం నవ్వుతూనే.

"నవ్వే పిచ్చి" అన్నాడు తాపీగా.

"నీ వేషం చూసి నవ్వకపోతే ఏడవ్వమంటావా?"

"ఏమయింది నా వేషానికి?"

"డ్రాయరుతో వచ్చావు, పేంటు లేదా?" అంటూ పకపక నవ్వాడు జయరాం.

అందరూ తన్ను చూసి ఎందుకు నవ్వుతున్నారో అర్థమయింది.

గిరుక్కున వెనుదిరిగి వంచిన తల ఎత్తకుండా పరుగు లాంటి నడకతో గదికి వెళ్లాడు రంజన్.

తలుపు తీసేసరికి ఓ కవరు కనిపించింది.

కవరు మీది దస్తూరి నాన్నగారిదే. అంత త్వరగా మళ్లీ ఏం రాశారో నని ఆత్రంగా కవరు చించాడు.

ఉత్తరం రాసింది నాన్నగారు కాదు, అమ్మ. ఏం రాసిందోనని మౌనంగా చదవసాగాడు.

"చిరంజీవి రంజన్,

"మేం క్షేమం. నీవు క్షేమంగా ఉండాలని ఏడుకొండలస్వామి వేంకటేశ్వర్లుని వేడుకుంటున్నాను.

"నీ అడ్రసు రాసిన కవరు టేబుల్ మీద ఉంచి అనంతపురం వెళ్లారు మీ నాన్నగారు. పోస్టు చేయడం మరిచిపోయారేమో అని కవరు తీసి చూశాను. అందులో ఉత్తరం లేదు. టేబుల్ సారుగులో చూశాను. అందులోని కాగితాల్లో నీకు రాసిన ఉత్తరం కనిపించింది. దాన్ని కవరులో ఉంచి పోస్టు చేశాను.

"మీ నాన్నగారు అనంతపురం నుండి తిరిగి వచ్చిన తరువాత అడిగారు - సొరుగులో ఉంచిన కాగితాలు ఏమయ్యాయని.

"నీకు పంపానని చెప్పాను.


"వాడి కెందుకు పంపావే?" అన్నారు.

"అందులో బాబు పేరు ఉంటే ఉత్తరం రాసి పోస్టు చేయడం మరిచిపోయారని పంపాను" అన్నాను.

"ఏదో కథ రాస్తూ మధ్యలో ఆపేసి, సొరుగులో వేసి వెళ్లాను. దాని తాలూకు రఫ్ కాపీ కూడా లేదు, ఆ కాగితాలు పంపమని బాబుకు ఉత్తరం రాయమని" చెప్పారు మీ నాన్నగారు. ఆ కాగితాలు వెంటనే పంపించు.

"ఇట్లు దీవెనలతో మీ అమ్మ."

నాన్నగారు రాసింది కల్పిత కథ అని, తన ప్రేమాయణానికి, కథకు పోలికలు ఉండడం కాకతాళీయమని, తన ప్రేమాయణం తల్లిదండ్రులకు తెలియలేదని తెలుసుకున్న రంజన్ నెత్తిమీది బరువు దిగిపోయినట్లు హాయిగా గాలి పీల్చుకున్నాడు. ★



**కటవుట్**

"ఆ హీరో ఎలక్షన్లో అంత మెజారిటీతో గెలవడానికి ప్రత్యేక కారణాలేమైనా ఉన్నాయా?" అని అడిగాడు విలేఖరి విశ్వం అతని సెక్రటరి సెల్వమణిని.

"ఆ... ఏముంది... ఎలక్షన్లో గెలిస్తే తను నటించిన సినిమాల కటవుట్‌లతో 'కటవుట్ల ఇల్లు' నిర్మించి ఇస్తానని వాగ్దానం చేశాడంతే?" అసలు విషయం తెలియజేశాడు సెక్రటరి సెల్వమణి.

**ఎన్.ప్రమీలా రమేష్‌రెడ్డి[ తిరుపతి]**